సాక్షి అనకాపల్లి

శనివారం । 13 । మే । 2023



క్రమశిక్షణతో ఎదిగిన నేత

పూర్వ ఆచార్యుడైన మంత్రి మేరుగు నాగార్జునను ఏయూ ఘనంగా సత్కరించింది. టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. IIలో



ధన్యవాదాలు

ఆరిలోవ: ఉన్నత వైద్యం అందిస్తామని భరోసా ఇచ్చిన సీఎం జగన్‌కు హృద్రోగ బాధితుడు చరణ్ సాయి తల్లి కృతజ్ఞతలు తెలిపారు.

వాతావరణం

అనకాపల్లి టౌన్: రాగల అయిదు రోజులు 29 నుంచి 29.4 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎం బీజీఎస్ కుమారి శుక్రవారం పేర్కొన్నారు. గాలిలో తేమ 70 నుంచి 73 శాతం, గాలి గంటకు 4 నుంచి 5 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

మహిళా ఉపాధిలో...

‘సూపర్’ మార్ట్‌లు

పేదకుటుంబాల్లో ప్రతి మహిళా ఆర్థికంగా నిలదొక్కుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తుంది. ఇందులో భాగంగా మహిళా సంఘాలను వేదికగా చేసి ఏర్పాటు చేసిన మహిళా చేయూత సూపర్‌మార్ట్‌లు సూపర్ ఫలితాలు ఇస్తుండడంతో జిల్లాలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో మార్టుల ఏర్పాటు దిశగా అధికారులు చొరవ చూపుతున్నారు. ఈ ఏడాది ఆరు జగనన్న సూపర్ మార్టుల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నెలాఖరుకు సబ్బవరంలో రూ.32 లక్షలతో సూపర్‌మార్టు ప్రారంభానికి పనులు జరుగుతున్నాయి. జూన్ నాటికి చోడవరం, క్రమంగా ఎస్.రాయవరం, నక్కపల్లి, నర్సీపట్నం, కె.కోటపాడులో ఏర్పాటు చేసేందుకు మహిళా సంఘాల సభ్యుల నుంచి చందాలు వసూలు చేస్తున్నారు.

లాభాల్లో మాడుగుల సూపర్ మార్కెట్

గత ఏడాది డిసెంబర్ 9న 14,700 మంది మహిళా సభ్యుల చందాలతో రూ.32 లక్షలతో ప్రారంభించిన ‘మాడుగుల జగనన్న సూపర్ మార్కెట్’ లాభాల బాటలో సూపర్‌గా నడుస్తోంది. కేవలం ఆరు నెలల్లోనే.. అంటే మే నెల నాటికి మొత్తం రూ.55 లక్షల మేర వ్యాపారం జరిగింది. గడిచిన ఆరు నెలల్లో సగటున నెలకు రూ.12 లక్షల వరకు వ్యాపారం జరుగుతోంది. ఇలా నెలకు సరాసరి ఆదాయం రూ.1 లక్ష వరకు రాగా మార్కెట్ నిర్వహణ, సిబ్బంది జీతాలు పోగా రూ.50 వేల వరకు లాభం వచ్చింది. రోజుకు సగటున రూ.36 వేల వ్యాపారం జరుగుతోంది. మార్ట్‌లో మహిళా సంఘాల సభ్యులే సిబ్బందిగా ఉపాధి పొందుతున్నారు.

- జిల్లాలో మరో ఆరు సూపర్ మార్ట్‌ల ఏర్పాటుకు డీఆర్‌డీఏ ప్రణాళిక
- త్వరలో సబ్బవరం, చోడవరంలో ప్రారంభం
- ఐటీసీ, అజియో, పీఅండ్‌జీ, హెచ్‌యూఎల్, ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ కంపెనీలతో ఒప్పందం
- మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి



మాడుగులలో వైఎస్సార్ చేయూత మహిళా సూపర్ మార్ట్

తుమ్మపాల : మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేయడం ద్వారా పేదరికంలో ఉన్న మహిళా గ్రూపులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యం. డీఆర్డీఏ ఆధ్వర్యంలో వైఎస్సార్ క్రాంతి పథంలో మహిళా సంఘాలను ఒక వేదికగా చేర్చి వ్యాపారాల ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో 39,899 సంఘాల్లో 4,34,320 మంది మహిళా సభ్యులతో పట్టణాల్లో కార్పొరేట్ సంస్థలకు దీటుగా చేయూత మహిళా మార్ట్‌ల పేరుతో సూపర్ మార్కెట్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో మాడుగులలో చేయూత మహిళా మార్టు ఏర్పాటు చేసి దిగ్విజయంగా నడుపుతున్నారు. త్వరలో సబ్బవరం, చోడవరం పట్టణాల్లో ఒక్కో మార్ట్‌ను ప్రారంభించేందుకు పనులు జరుగుతున్నాయి. ఇలా మండలానికో చేయూత మహిళా మార్ట్ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా డీఆర్డీఏ అధికారులు కార్యాచరణ చేస్తున్నారు.

విస్తరణకు ప్రణాళికలు

ఇప్పటికే రాష్ట్రంలో పలు జిల్లాల్లో మహిళా మార్ట్‌లు విజయవంతంగా నడుస్తుండడంతో ప్రభుత్వం వీటిని విస్తరించే ఆలోచన చేస్తుంది. ఈ మేరకు ఐటీసీ, అజియో, పీఅండ్‌జీ, హెచ్‌యుఎల్ కంపెనీలతో పాటు ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్‌తో ఒప్పందం ప్రకారం నాణ్యమైన సరుకులను తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. మార్ట్‌ల నిర్వహణ ద్వారా వచ్చే లాభాలను డ్వాక్రా సంఘంలోని సభ్యులు పంచుకోనున్నారు. ఆసక్తి ఉంటే అవకాశం మేరకు లాభాలతో మరో సూపర్ మార్ట్ ఏర్పాటు చేసుకునే విధంగా డీఆర్డీఏ ప్రోత్సహిస్తుంది.



షాపింగ్ మాల్‌కు దీటుగా..

చౌక ధరకే నాణ్యమైన ఉత్పత్తులు



జగనన్న మహిళా సూపర్ మార్టులు లాభాల బాటలో నడుస్తున్నాయి. స్వయం సహాయక సంఘాల సభ్యులు ఒక్కొక్కరు రూ.200 పెడుతున్నారు. పలు కంపెనీలతో ఒప్పందంతో ఈ మార్కెట్‌లో నాణ్యతతో కూడిన బ్రాండెడ్ సరుకులను తక్కువ ధరకే అందిస్తున్నాం. మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులు కూడా మార్ట్‌లో లభ్యమవుతాయి. రాష్ట్రంలోనే అతి తక్కువ ధరకు జీడిపప్పును ప్రత్యేకంగా అమ్ముతున్నాం. జిల్లాలో నాతవరం, గొలుగొండ ప్రాంతాల్లో గల మిల్లుల నుంచి జీడీపప్పు తీసుకొచ్చి కొన్న ధరకే విక్రయిస్తున్నాం. నాణ్యమైన జీడిపప్పు కేజీ.రూ.650కే అందిస్తున్నాం

–డీపీఎం, వరప్రసాద్, డీఆర్డీఏ

మహిళా మార్టులను వినియోగించుకోండి...



జిల్లాలో మహిళా మార్టుల ఏర్పాటు ద్వారా మహిళలు మంచి లాభాలు పొందుతున్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన మాడుగులలో మార్టు లాభాల బాటలో ఉంది. ఈ నెలాఖరుకు సబ్బవరంలో మార్టు ప్రారంభిస్తాం. ఈ ఏడాదిలో జిల్లాలో మొత్తం ఆరు మార్టులు ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నాం. నాణ్యమైన సరుకులను తక్కువ ధరకే విక్రయిస్తున్నాం. ఈ మార్టులను అందరూ సద్వినియోగం చేసుకోవాలి. గ్రామాల్లో కనీసం రూ.10 వేలు సరుకులు కొంటే మా వీవోఏల ద్వారా సరుకులు నేరుగా ఇంటికే డోర్ డెలివరీ చేస్తాం. రూ.20వేలు దాటితే అదనపు డిస్కౌంట్ కూడా అందిస్తాం

– పీడీ, లక్ష్మిపతి, డీఆర్డీఏ, అనకాపల్లి జిల్లా

అందుబాటులో మహిళా మార్ట్



మహిళా మార్టు మాడుగులలో ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉంది. సరళమైన ధరలకు నాణ్యమైన వస్తువులు ఒకే చోట దొరుకుతున్నాయి. వారానికి ఒకసారి మార్ట్‌కు వస్తే సరిపోతుంది. డ్వాక్రా సభ్యురాలిగా మహిళా మార్ట్ ప్రగతిలో పాలుపంచుకోవడం ఆనందంగా ఉంది. ఉదయం 9 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు మార్ట్ అందుబాటులో ఉండడం వలన పనులు ముగించుకుని వస్తువులు కొనుగోలు చేసుకుంటున్నాము. ఏజెన్సీ గ్రామాలతోపాటు మండల ప్రజలకు అందుబాటులో వస్తువులు దొరుకుతున్నాయి.

– రాజమండ్రి లక్ష్మి, గణేష్ కాలనీ, మాడుగుల

విజయం ‘పది’లం

పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించిన విజయాలపై ప్రశంసల జల్లు కురుస్తోంది. చదువు చెప్పిన ఉపాధ్యాయులకు సత్కారాలు చేస్తూ.. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనల్లో ముంచెత్తుతున్నారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం



తెనుగుపూడి గురుకుల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

దేవరాపల్లి: తెనుగుపూడి డా.బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయం పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధించడంతో స్థానిక ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్‌ను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కార్యదర్శి వి.ఆర్.పవనమూర్తి అభినందించారు. విశాఖపట్నం కొమ్మాదిలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల గురుకుల విద్యాలయాల సమన్వయకర్త ఎస్.రూపావతితో కలిసి ఘనంగా సత్కరించారు. జోన్-1 (ఉత్తరాంధ్ర)లో తెనుగుపూడి గురుకులం మాత్రమే శతశాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు 15 మందికి 500పైబడి మార్కులు రావడం, పాఠశాలకు చెందిన వి.మనోహర్ 578 మార్కులు సాధించడం అభినందనీయమన్నారు.

విద్యార్థికి అభినందన



కామిరెడ్డి హేమశ్రీ, తల్లి గోవిందమ్మను సత్కరిస్తున్న రాష్ట్ర పరీక్షల డైరెక్టర్ దేవానందరెడ్డి

అచ్యుతాపురం బాలికల గురుకులం విద్యార్థి కామిరెడ్డి హేమశ్రీ టెన్త్‌లో 594 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలవడం ప్రశంసనీయమని రాష్ట్ర పరీక్షల డైరెక్టర్ గట్టు దేవానందరెడ్డి అన్నారు. శుక్రవారం బాలిక స్వగ్రామం దేవరాపల్లి మండలం కొత్తపెంటకు వచ్చిన ఆయన హేమశ్రీ, ఆమె తల్లి గోవిందమ్మలను శాలువాతో సత్కరించి, 5 వేలు నగదు ప్రోత్సాహకాన్ని, జ్ఞాపికను అందజేశారు. ఆమెను మంచి కాలేజీలో చేర్పించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మి, ఏడీ రవిబాబు, మండల విద్యాశాఖ అధికారి సిహెచ్.రవీంద్రబాబు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బాల్య వివాహం నిరోధానికి నోటీసు

రోలుగుంట : బాల్య వివాహాలకు పాల్పడిన వారెవరైనా చట్టపరమైన చర్యలు తప్పవని మండలం కె.నాయుడుపాలెం సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం.వి.సౌజన్య శుక్రవారం నోటీసు ద్వారా హెచ్చరించారు. కె.నాయుడుపాలెం పంచాయతీ శివారు అంట్లపాలెం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థినికి ఆమె తల్లిదండ్రులు పెళ్లి కుదిర్చి వచ్చే నెలలో వివాహం చేయడానికి నిశ్చయించారు. విషయం తెలుసుకున్న కె.నాయుడుపాలెం సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి సౌజన్య శుక్రవారం గ్రామానికి వెళ్లి ఆ బాలిక తల్లిదండ్రులను కలిసి చట్టపరంగా బాల్య వివాహాలు చేయడం నేరమని, ధిక్కరిస్తే కేసుల నమోదు, చట్ట పరమైన చర్యలు తప్పవని తెలిపి నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని ఐసీడీఎస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నానని తెలిపారు.

‘జగనన్నకు చెబుదాం’లో ఏడు ఫిర్యాదుల పరిష్కారం



బుచ్చెయ్యపేటలో ఫిర్యాదుదారుని వివరాలు తీసుకుంటున్న డీపీవో శిరీషారాణి

బుచ్చెయ్యపేట : ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రవేశ పెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి తెలిపారు. శుక్రవారం బుచ్చెయ్యపేటలో జగనన్నకు చెబుదాం.. ఫిర్యాదుల పరిష్కార వేదిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. రెవెన్యూ సమస్యలపై ఐదుగురు, పంచాయతీరాజ్ నుంచి ఇద్దరు జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేశారు. డీపీవో, తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో సువర్ణరాజు, ఎస్ఐ కుమారస్వామి, డిప్యూటీ తహసీల్దార్ మురళి సమక్షంలో ఏడుగురు లబ్ధిదారుల సమస్యలను అధికారులు పరిష్కరించారు. ప్రతి శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు.

నర్సీపట్నం ఆస్పత్రిలో త్వరలో ఎస్ఎన్‌సీయూ




ఎన్ఆర్‌సీ సెంటర్‌లో అందిస్తున్న సేవలపై ఆరా తీస్తున్న జాయింట్ డైరెక్టర్ అర్జున్

నర్సీపట్నం: నవజాత శిశువులకు సత్వరమే వైద్య సేవలు అందించేందుకు ఏరియా ఆస్పత్రిలో త్వరలోనే పది పడకల ఎస్ఎన్‌సీయూను అందుబాటులోకి తీసుకువస్తున్నామని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ జాయింట్ డైరెక్టర్ అర్జున్ పేర్కొన్నారు. రూ.35 లక్షల వ్యయంతో సిద్ధం చేసిన ఎస్ఎన్‌సీయూ యూనిట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం గిరిజన చిన్నారుల కోసం ఏర్పాటు ఐదు పడకల మినీ ఎస్ఎన్‌సీయూను పరిశీలించి ఓపీ వివరాలను, అక్కడ అందిస్తున్న సేవలపై యూనిట్ ఇన్‌చార్జి డాక్టర్ మల్లికార్జున్‌ను ఆరా తీశారు. ఎన్ఆర్‌సీ, ప్రసూతి విభాగాలను తనిఖీ చేశారు. పౌష్టికాహార లోపంతో బాధపడుతూ వైద్యం పొందుతున్న చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలోనే పది పడకల ఎస్ఎన్‌సీయూను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయా విభాగాలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయన వెంట ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ ప్రధాన్, వైద్యురాలు సువర్ణ ఉన్నారు.

చార్జింగ్‌లో ఉండగా ఫోన్‌కాల్

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



నర్సీపట్నం: నర్సీపట్నం కోమటివీధికి చెందిన కె.లక్ష్మణ్ (25) విద్యుత్ షాక్‌తో శుక్రవారం మృతి చెందాడు. టౌన్ సీఐ ఎన్.గణేష్ కథనం... మృతుడు లక్ష్మణ్ శుభకార్యాల క్యాటరింగ్ బాయ్స్‌ను సరఫరా చేస్తుంటాడు. ఇంటి దగ్గర ఫోన్ చార్జింగ్‌లో ఉన్నప్పుడు కాల్ రావడంతో ఫోన్‌లో మాట్లాడుతుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురయ్యాడు. వెంటనే బంధువులు సమీపంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

మృత్యుశకటం

- భైక్‌ను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు
- ఇద్దరు యువకుల దుర్మరణం





కిలాడి శ్రీను, కారుకొండ శ్రీను (ఫైల్)



అచ్యుతాపురం నాలుగు రోడ్ల కూడలిలో ధర్నా

అచ్యుతాపురం (అనకాపల్లి): దుస్తుల కర్మాగారం ఉద్యోగులను తీసుకెళ్లే వాహనాల మితిమీరిన వేగం మరో ఇద్దరి మృతికి కారణమయ్యింది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలు.. వెదురువాడ వద్ద శుక్రవారం మధ్యాహ్నం వేగంగా వెళుతున్న గౌతమ్ ట్రావెల్ బస్సు.. అప్పుడే మలుపు తిరుగుతున్న కిలాడి శ్రీను (24), కారుకొండ శ్రీను (23)లు వెళుతున్న బైక్‌ను ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఇద్దరూ చికిత్స పొందుతూ ఒకరు ఎన్టీఆర్ ఆస్పత్రిలో, మరొకరు అనకాపల్లి ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు.

రోడ్డున పడ్డ కుటుంబాలు

అచ్యుతాపురానికి చెందిన కిలాడి శ్రీనుకి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఈ దుర్ఘటనతో వారు దిక్కులేని వారయ్యారు. శ్రీను తండ్రి కుమారుడి మృతితో కన్నీరుమున్నీరవుతున్నారు. నాలుగేళ్ల క్రితం పెద్ద కొడుకు పచ్చకామెర్లతో చనిపోయాడు. చిన్న కొడుకు శ్రీను చేదోడువాదోడుగా ఉండేవాడు. కొడుకు, కోడలు, మనవలతో హాయిగా కాలం గడుపుతున్న వృద్ధుడు ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృతి చెందటంతో విలపిస్తున్న తీరు చుట్టుపక్కల వారిని కలచివేసింది. ఇదే ప్రమాదంలో మృతి చెందిన కారుకొండ శ్రీను జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లయి ఎంతో కాలం కాలేదు. ముందు రోజే వారి వివాహ వార్షికోత్సవం జరిగింది.

స్థానికుల ఆందోళన

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మరణించడంతో వెదురువాడ వద్ద, అచ్యుతాపురం నాలుగు రోడ్ల కూడలిలో జనం ఆందోళన చేశారు. ఈ ఆందోళనతో రహదారి పొడవునా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేశారు. మృతులకు రూ.6.5 లక్షల వంతున పరిహారం చెల్లించేందుకు ట్రావెల్స్ యాజమాన్యం అంగీకరించడంతో స్థానికులు ఆందోళన విరమించారు.

అందరికీ అందుబాటులో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి

తుమ్మపాల : యలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురం మండలంలో వీఎంఆర్‌డీఏ ప్లాట్లు సిద్ధం చేసినట్టు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వీఎంఆర్‌డీఏ రూపొందించిన ప్లాట్ల అమ్మకాల వెబ్‌సైట్, బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం అనకాపల్లికి 16 కిలోమీటర్లు, విశాఖకు 36 కిలోమీటర్లు దూరంలో ఉందని చెప్పారు. మండలంలో చోడపల్లి, భోగాపురం గ్రామాల్లో రూ.26.40 లక్షల ఖరీదులో 3 రకాల 183 ఎంఐజీ ప్లాట్లు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలు, ఉద్యోగ వ్యాపార రంగాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీకే పీసీపీఐఆర్ ఛైర్‌పర్సన్ చుక్కాకుల లక్ష్మీ వెంకటరావు, వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర, నోడల్ అధికారి శిల్ప, డిప్యూటీ డైరెక్టర్ బి.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

అటవీశాఖకు ప్రత్యామ్నాయ భూములు

- జెట్టీ, ఫిష్‌ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి అనువుగా రిజర్వ్ ఫారెస్ట్ స్థలాలు
- వేరొక ప్రాంతంలో భూముల కేటాయింపునకు చర్యలు
- స్థల పరిశీలన చేసిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



దొండవాక తీరంలో జెట్టీ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

నక్కపల్లి: మత్స్యకారుల వలసలు నిరోధించి స్థానికంగా ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన ఫిష్‌ల్యాండింగ్ సెంటర్, జెట్టీల నిర్మాణానికి చకచకా అడుగులు పడుతున్నాయి. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఫిష్‌ల్యాండింగ్ సెంటర్, పెదతీనార్ల శివారు దొండవాకలో జెట్టీ నిర్మించేందుకు ప్రభుత్వం రూ.26 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రాంతాలను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి శుక్రవారం పరిశీలించారు. వీటి నిర్మాణానికి 10 ఎకరాల స్థలం కావాలి. జెట్టీకి 5 ఎకరాలు కావాలి. దొండవాకలో ఐదెకరాల రిజర్వ్ ఫారెస్టు భూమి ఉంది. అలాగే రాజయ్యపేటలో ఫిష్‌ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి కూడా ఐదెకరాలు కావాలి. అక్కడ కూడా ఫారెస్టు భూమి ఉంది. ఈ రెండు ప్రాంతాల్లోను 10 ఎకరాల ఫారెస్టు భూమిని సేకరించాలని, ప్రత్యామ్నాయంగా అటవీశాఖ వారికి వేరొక ప్రాంతంలో భూమిని కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. స్థల పరిశీలన పూర్తయి అన్ని అనుమతులు లభిస్తే ఈ రెండు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలకు ఎల్‌పీసీలు ఇవ్వాలని వినతి

రాజయ్యపేట పర్యటనకు వచ్చిన కలెక్టర్‌ను పలువురు మత్స్యకారులు కలిశారు. తాము చాలా ఏళ్ల నుంచి ఇక్కడ అటవీ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నామని, చాలా మందికి ఉన్న ఖాళీ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు ఎల్‌పీసీలు ఇవ్వడంలేదని వాపోయారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లు నిర్మించుకునేందుకు కూడా ఇబ్బందులు ఉన్నాయని, ఎల్‌పీసీలు లేకపోవడంతో ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ ఇలా ఎంతమంది అటవీ శాఖ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నారో సర్వే చేయాలని, అటవీ శాఖ నుంచి ఎన్‌వోసీ తీసుకుని, ప్రత్యామ్నాయంగా వేరొక ప్రాంతంలో భూమిని కేటాయించేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేడీ మోహన్‌రావు, తహసీల్దార్ నీరజ, ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, సర్పంచ్ మైలపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ మేరుగు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ ఉంటేనే డెవలప్‌మెంట్

- ఉద్యోగ మేళా సభలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ
- మేళాలో పాల్గొన్న 15 కంపెనీలు.. 350 మందికి దక్కిన ఉద్యోగాలు



ఇంటర్వ్యూ చేస్తున్న కంపెనీ హెచ్‌ఆర్, హాజరైన నిరుద్యోగులు



స్కిల్ హబ్‌లో శిక్షణ పొందిన మహిళకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం రూరల్: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చోడవరంలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగ మేళా విజయవంతమైంది. సుమారు 700 మంది నిరుద్యోగులు హాజరు కాగా 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. 350 మందికి ఉద్యోగాలు దక్కాయి. ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళాను ప్రారంభించారు. విద్యతోపాటు ఏదైనా స్కిల్ ఉంటేనే జీవితంలో డెవలప్‌మెంట్ ఉంటుందని, దీని కోసమే ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందని ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ చెప్పారు. చోడవరం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో నిరుద్యోగ యువతకు శిక్షణనిచ్చి ఉద్యోగావకాశాలను సైతం కల్పిస్తున్నామని, ప్రతి మూడు నెలలకు ఒక కొత్త బ్యాచ్‌ను శిక్షణకు ఎంపిక చేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా స్కిల్ హబ్‌లో శిక్షణ పొందిన మహిళలకు ధర్మశ్రీ ధ్రువపత్రాలను అందచేశారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ సమావేశానికి అధ్యక్షత వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా డైరెక్టర్ చాముండేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్, ఎంపీపీ గాడి కాసు, చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక వెంకట సత్యారావు, వైస్ ఎంపీపీ నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన అభ్యర్థులు

ఉద్యోగ మేళాలో 350 మందికి ఉద్యోగాలు దక్కాయి. వీరిలో ముగ్గురు ఐటీ ఉద్యోగాలు సాధించారు. ది ప్లేస్‌మెంట్ పార్కు కంపెనీ నెలవారీ 25 వేల రూపాయల వేతనంతో అపాయింట్‌మెంట్‌ను స్థిరపరిచింది. అరబిందో ఫార్మా కంపెనీ 33 మందికి ఉద్యోగాలు కల్పించింది. వీరికి నెలకు రూ.16 వేల వేతనాన్ని ఇవ్వడానికి కంపెనీ ప్రతినిధులు సుముఖత వ్యక్తం చేశారు. ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు నలుగురిని ఎంపిక చేసి వీరికి కూడా రూ.16 వేల నెలవారీ వేతనాన్ని ఆఫర్ చేసింది. ఆక్వా సేఫ్ వాటర్ కంపెనీ సర్వీస్ రంగంలో అత్యధికంగా 180 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసింది. మెడ్‌ప్లస్ ఫార్మసీ 24మందికి, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్ మాన్యుఫాక్చరింగ్ 31మందికి, అపోలో ఫార్మసీ 15మందికి, నవత రోడ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీ మాన్యుఫాక్చరింగ్‌లో 14మందికి, రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ కంపెనీ టెలికాంలో 14మందికి, వరుణ్ మోటార్స్ ఆటోమొబైల్ 12మందికి, శర్వాణీ స్వీట్స్ సర్వీస్ రంగంలో 12 మందికి, క్యాస్ కార్ప్ బ్యాంక్ తొమ్మిది మందికి నియామకాలు జరిపింది. డెక్కన్ కెమికల్స్, శ్రీరాం చిట్స్ మరికొన్ని నియామకాలు జరిపాయని స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా డైరెక్టర్ చాముండేశ్వరరావు తెలిపారు. విజేతలకు నేరుగా ఆయా కంపెనీల నుంచి అపాయింట్‌మెంట్ లెటర్లు అందుతాయని చెప్పారు. మేళా నిర్వహణలో చోడవరం స్కిల్ హబ్ నిర్వాహకుడు శ్రీనివాస్, నర్సీపట్నం హబ్ నిర్వాహకుడు శ్రీనివాసరావు సహకరించారు.

తోపులాటపై ఇరువర్గాల ఫిర్యాదు

గొలుగొండ : నాగాపురంలో ఇరువర్గాల మధ్య తోపులాటపై కృష్ణదేవిపేట పోలీసులకు శుక్రవారం ఫిర్యాదులు అందాయి. గ్రామంలోని రామాలయం వద్ద టీడీపీకి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్ పార్కింగ్ చేశారు. భక్తుల ఇబ్బందుల దృష్ట్యా సర్పంచ్ యలమంచిలి రఘురాం గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి బైక్ తీయాలని చెప్పారు. దీంతో టీడీపీ వర్గీయులు సర్పంచ్‌పై తిరుగుబాటుకు దిగారు. ఆలయ మండపంలో బైక్ ఉండడం వలన భక్తులకు ఇబ్బందులు ఏర్పడడంతో బైక్ తీయమని చెప్పాను, తప్ప మరే ఉద్దేశం కాదని, తాను వైఎస్సార్‌సీపీ మద్దతుదారు కావడంతో కావాలనే టీడీపీ కార్యకర్తలు తోపులాటకు దిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కృష్ణదేవిపేట పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

15 మంది వ్యాపారుల బైండోవర్

అనకాపల్లిటౌన్ : మండలంలోని మారేడుపూడి గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు జాతీయ రహదారిపై కత్తుల వ్యాపారం పేరిట భయభ్రాంతులకు గురి చేస్తున్నారంటూ వాహనదారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు చర్యలు చేపడుతున్నట్టు రూరల్ సీఐ రవికుమార్ చెప్పారు. శుక్రవారం జాతీయ రహదారిపై కత్తులు అమ్మకాలు చేస్తున్న 15 మందిని అదుపులోకి తీసుకొని బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పాము కాటుకు మహిళా రైతు మృతి

మునగపాక : మండలంలోని మడకపాలెంలో పాముకాటుకు గురై మహిళా రైతు మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మడకపాలెం గ్రామానికి చెందిన మహిళా రైతు ఉల్లింగల పద్మ(45) గురువారం సాయంత్రం పొలంలోని పశువులకు పాలు తీసేందుకు వెళ్తుండగా ఆమెను పాము కాటు వేసింది. గుర్తించిన స్థానికులు ఆమెను అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పద్మ శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మునగపాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలు పద్మకు భర్త సత్తిబాబు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె మృతితో గ్రామంలో విషాదం అలముకుంది.

అభివృద్ధితోపాటు, ఆరోగ్యంపై దృష్టి

అధికారులకు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సూచన



దొండవాకలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

నక్కపల్లి : అభివృద్ధితోపాటు, ఆరోగ్యంపై కూడా దృష్టిసారించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని దొండవాక పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులు, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం పలువురు గ్రామస్తులు తమ ఇబ్బందులను, బిల్లుల చెల్లింపుల్లో సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాడు-నేడు పనులు వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తిచేయాలన్నారు. నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. పనులు నాశిరకంగా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనులను మండల స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. జగనన్న కాలనీల్లో ప్రతి పేదవాడికి ప్రభుత్వం ఇంటిస్థలం మంజూరు చేసి, పక్కా గృహాలు కేటాయించిందన్నారు. వీటిని త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేసేలా వైద్య ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలన్నారు. వడదెబ్బ నివారణ, వైరల్ జ్వరాలు, అతిసారం ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రక్తహీనత నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని, క్లోరినేషన్ చేయించి ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని పేర్కొన్నారు. జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రమామణి, తహసీల్దార్ నీరజ, ఎంపీడీవో సీతారామరాజు, ఎంఈవో డీవీడీ ప్రసాద్, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, సర్పంచ్ మైలపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ ఎం.నాగేశ్వరరావు, గృహనిర్మాణశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఎదిగిన నేత మేరుగు

- ఏయూతో ఎంతో అనుబంధం
- ఘనంగా సత్కరించిన వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



మేరుగు నాగార్జునను దుశ్శాలువాతో సత్కరిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

ఎంవీపీకాలనీ(విశాఖ): రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జునను ఆంధ్రవిశ్వవిద్యాలయం ఘనంగా సత్కరించింది. ఏయూ పూర్వ ఆచార్యుడైన ఆయన రాజకీయ నాయకుడిగా ఉన్నతంగా ఎదగడంతో పాటు మంత్రిగా ఉన్న నేపథ్యంలో ఏయూ యంత్రాంగం ఆయనను ఘనంగా సత్కరించింది. ఏయూ అంబేద్కర్ అసంబ్లీ హాల్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమానికి ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అధ్యక్షత వహించగా టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏయూ వారసత్వం ఉన్న వ్యక్తి అయినందునే ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. ఇక్కడ క్రమశిక్షణ, బోధన అనుభవం ఆయనను మంచి రాజకీయ నాయకుడిగా తీర్చిదిద్దాయన్నారు. గతంలో ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా సమర్థవంతమైన సేవలు అందించిన నాగార్జున ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా అదే ఒరవడిని కొనసాగిస్తున్నారన్నారు. సీఎం జగన్ ఆకాంక్షకు అనుగుణంగా ఏయూలో జరుగుతున్న అభివృద్ధిని ఆయన ప్రశంసించారు. ఆ-హబ్, ఇన్నోవేషన్ సెంటర్‌తో పాటు ఆవిష్కరణలకు, ఉన్న ప్రమాణాలకు బాటలు వేస్తూ వీసీ ప్రసాదరెడ్డి వర్సిటీకి అందిస్తున్న సేవలను కొనియాడారు. ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌లు మాట్లాడుతూ వెనుకబడిన సామాజిక వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా నాగార్జున నిత్యం శ్రమిస్తున్నారన్నారు. రాష్ట్రానికి, దళిత సామాజిక వర్గానికి ఆయన మరిన్ని ఉన్నత సేవలు అందించాలన్నారు. వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ఏయూ విద్యార్థిగా, పరిశోధకుడిగా, ఆచార్యుడిగా, రాజకీయ వేత్తగా మంత్రి నాగార్జున ఎదిగిన తీరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక స్ఫూర్తికి, చైతన్యానికి నిదర్శమన్నారు. సన్మాన గ్రహీత మంత్రి నాగార్జున మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం నేర్పిన క్రమశిక్షణే తనను ఈ స్థాయికి చేర్చిందన్నారు. తన రాజకీయ ఎదుగుదలలో వైఎస్సార్ కుటుంబం అందించిన ప్రోత్సాహం వెలకట్టలేనిదని కొనియాడారు. అనంతరం అతిథులు ఆయనను ఘనంగా సత్కరించారు. ప్రజా, ఉద్యోగ, న్యాయ, దళిత సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయన్ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గొల్లబాబూరావు, అదీప్‌రాజు, మాజీ వీసీ బాలమోహన్‌దాస్, ఆచార్య నరసింహారావు, ఆచార్య ధనుంజయరావు, ఆచార్య చల్లా రామకృష్ణ, ఆచార్య పుల్లారావు, ఆచార్య షారోను రాజు, వర్సిటీ ప్రస్తుత, పూర్వ ఆచార్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

1200 హెక్టార్లలో సూక్ష్మనీటి సాగుకు ప్రణాళిక

- రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్‌లకు జిల్లాలో 1180 దరఖాస్తులు
- ఈనెల 15 నుంచి దరఖాస్తుల పరిశీలన
- సూక్ష్మ నీటి సాగు పథకం జిల్లా ప్రాజెక్టు డైరెక్టరు లక్ష్మి



నాతవరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి లక్ష్మి

నాతవరం : రైతులకు రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్ యూనిట్ల ఏర్పాటుకు ఈ నెల 15 నుంచి దరఖాస్తుల్ని పరిశీలించనున్నట్టు సూక్ష్మనీటి సాగు పథకం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టరు, మండల ప్రత్యేకాధికారి జి.వి.లక్ష్మి అన్నారు. ఆమె నాతవరం మండలం ప్రత్యేకాధికారిగా శనివారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి చిన్నారులతో ముచ్చటించారు. ప్రభుత్వం కేంద్రం అందిస్తున్న పౌష్టికాహారం వివరాలు కేంద్రం నిర్వహణ తదితర అంశాలను కార్యకర్త వరలక్ష్మిని ఆరా తీశారు. తర్వాత శృంగవరంలో జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను స్వయంగా పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది సూక్ష్మ నీటి సాగు పథకంలో 1200 హెక్టార్లలో సాగు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ పథకంలో డ్రిప్, స్ప్రింక్లర్లు రాయితీపై పొందడానికి జిల్లాలో ఇంతవరకు 1180 మంది రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఈ దరఖాస్తులను క్షేత్ర స్థాయి పరిశీలన చేసి నిబంధనల ప్రకారం అర్హత ఉన్న రైతులకు రాయితీపై బిందు, తుంపర సేద్యం యూనిట్లు మంజూరు చేస్తామన్నారు. ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతుకు డ్రిప్ యూనిట్ 90 శాతం రాయితీ, అంతకంటే అధికంగా భూమి ఉంటే 50 శాతం ఇస్తామన్నారు. అదే రైతుకు స్ప్రింక్లర్ యూనిట్ అయితే 55 శాతం, భూమి ఎక్కువ ఉంటే 45 శాతం రాయితీ ఇస్తామన్నారు. ఈ యూనిట్‌కు దరఖాస్తు చేసుకునే రైతులు తమ వ్యవసాయ భూమికి సంబంధించి వెబ్‌లాండ్‌లో రికార్డులు సక్రమంగా ఉండాలని, భూమిలో నీటి సదుపాయం బోరు లేదా బావి, విద్యుత్ సదుపాయం కలిగి ఉండాలన్నారు. డ్రిప్ స్పింకర్లకు సంబంధించి మెటీరియల్ ఏర్పాటుకు ప్రభుత్వం జిల్లాలో మూడు కంపెనీలు ఏర్పాటు చేసిందన్నారు. సూక్ష్మ నీటి సాగు విధానం ద్వారా వ్యవసాయం చేయడం వల్ల పంటలో దిగుబడి పెరుగుతుందని ఎరువులు వాడకం, కూలీల సమస్య తగ్గుతుందని అన్నారు. కార్యక్రమంలోఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.విజయలక్ష్మి హౌసింగ్ జేఈ జోగారావు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీలో ప్రమాదం

ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలు



గాయపడిన కార్మికులను ఆర్‌కే ఆస్పత్రిలో పరామర్శిస్తున్న సీఐటీయూ నేత రాము

రాంబిల్లి: స్పెన్సులెస్ ఫార్మాటెక్ పరిశ్రమలో శుక్రవారం రోప్ తెగిపడ్డ ప్రమాదంలో ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాయ్యాయి. పలాస ప్రాంతానికి చెందిన కె.శివ, రాంబిల్లి మండలం కొత్తపట్నంకు చెందిన సీహెచ్ గంగరాజు, యలమంచిలి మండలం పులపర్తికి చెందిన ఎస్.నారాయణరావులు ఈ ప్రమాదంలో గాయపడ్డారు. వీరిని గాజువాకలోని ఆర్‌కే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్థానిక ఎస్‌ఐను వివరాల కోసం సంప్రదించగా ప్రమాదం జరగడం వాస్తవమేనని, దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు లేక కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ దీనబంధు తెలిపారు. రోప్ తెగిపోయిన ప్రమాదంలో గాయపడిన కార్మికులను యాజమాన్యం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను ఆయన పరామర్శించారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు.

బైక్‌ను లారీ ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన నూకరాజు, సంఘటనాస్థలిలో ఎస్‌ఐ లక్ష్మీనారాయణ

నాతవరం : మండలంలో శుక్రవారం లారీ బైక్ ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనికి సంబంధించి నాతవరం ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ అందించిన వివరాలు. మాధవనగరం గ్రామానికి చెందిన దమ్ము నూకరాజు(35) తన ఇంటి నుంచి జీడితోటకు బైక్‌పై వెళ్తున్నాడు. అదే రోడ్డులో కర్రల లోడ్‌తో వస్తున్న లారీ నూకరాజు బైక్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నూకరాజు తలకు గాయడం కావడంతో తీవ్ర రక్తస్రావమై, సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఇంటి నుంచి వెళ్లిన పది నిమిషాల వ్యవధిలోనే రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్లుగా సమాచారం రావడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడు నూకరాజు కల్లుగీత కార్మికుడు. సీజన్‌లో కల్లు విక్రయిస్తుంటాడు. మిగిలిన సమయంలో వ్యవసాయ పనులకు వెళ్తాడు. నూకరాజు భార్య గ్రామ వలంటీరుగా పని చేస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. పెద్దమ్మాయి దివ్యాంగురాలు కావడంతో ఇంటి వద్దే ఉంటుంది. నాతవరం ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృత దేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఏలేరు కాలువలో పడి వృద్ధుడి గల్లంతు

కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెం గ్రామం వద్ద ఏలేరు కాలువలో ప్రమాదవశాత్తూ పడి వృద్ధుడు గల్లంతయ్యాడు. ఎస్‌ఐ ఎ.ఆదినారాయణ రెడ్డి శుక్రవారం రాత్రి అందించిన వివరాలు. తాళ్లపాలెం గ్రామానికి చెందిన తనకాల అప్పారావు(63) సమీపంలోని ఉగ్గినపాలెంలో ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లాడు. అక్కడి ఏలేరు కాలువ వద్దకు సాయంత్రం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో జారి పడిపోయి గల్లంతయ్యారు. కాలువలో ఎక్కడ వెదికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ మేరకు కుమారుడు నాగేశ్వరరావు నుంచి అందిన ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం

గొలుగొండ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహణ



మృతుడు దేవుడు బాబు(ఫైల్)



గాయపడిన దేవుడుబాబును ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

తగరపువలస: ఆనందపురం మండలం దుక్కవానిపాలెం టోల్‌గేట్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనకాపల్లి జిల్లా గొలుగొండ పోలీస్‌స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ గవిరెడ్డి దేవుడుబాబు(47) మృతి చెందారు. ఈ ఘటనపై సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న దేవుడుబాబు తమ్ముడు అప్పలనాయుడు ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా కోర్టులో వారెంట్లు, సమన్లు తదితర విధులు నిర్వర్తించే దేవుడుబాబు శుక్రవారం ఉదయం కె.కోటపాడు మండలం చంద్రయ్యపేటలో తన ఇంటి నుంచి కోర్టుకు బయలుదేరారు. అదే సమయంలో తనకు వరసకు సోదరుడైన సింగంపల్లి అప్పలనాయుడు కూడా కారులో విశాఖ వస్తున్నందున.. అతనితో పాటు పెందుర్తి మీదుగా ఆనందపురం వైపు వస్తున్నారు. దుక్కవానిపాలెం టోల్‌గేట్ వద్ద వాటర్‌బాటిల్ కొనుగోలుకు అతను కారు నుంచి కిందకు దిగారు. తిరిగి కారు ఎక్కే సమయంలో వెనుక నుంచి మినీ లగేజీ వాహనం కారుతో పాటు దేవుడుబాబును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కింద పడిన హెడ్ కానిస్టేబుల్ తలకు బలమైన గాయమై కుడిచేయి విరిగిపోయింది. వెంటనే సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి అతన్ని తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతిక యుగంలో నైపుణ్యాభివృద్ధి ముఖ్యం

గోపాలపట్నం: సాంకేతిక యుగంలో నైపుణ్యాభివృద్ధి ముఖ్యమని ఐఎస్‌హెచ్‌ఆర్‌ఏఈ విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ యు.సి.ఎం.పట్నాయక్, ఐఈఐ చైర్మన్ పి.వి.ఎస్.గణేష్‌కుమార్ అన్నారు. ఎన్‌ఎస్‌టీఎల్‌లో ఐఈఐ ఎన్‌ఎస్‌టీఎల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా, ఇండియన్ సొసైటీ ఆఫ్ హీటింగ్ రిఫ్రిజిరేటింగ్ అండ్ కండిషనర్ ఇంజినీర్స్ (ఐఎస్‌హెచ్‌ఆర్‌ఏఈ) సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రాత్రి జాతీయ సాంకేతిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో ఇంజినీర్లు, శాస్త్రవేత్తల కృషి అమోఘమైందన్నారు. 1998లో పోఖ్రాన్ క్షిపణి ప్రయోగమే కాకుండా త్రిశూల్ క్షిపణి, ఎయిర్‌క్రాఫ్ట్ హంసా-3, ప్రయోగాలు విజయవంతమయ్యాయని తెలిపారు. ఈ ఏడాది 'స్కూల్ టూ స్టార్టప్- ఇగ్నైటింగ్ యంగ్ మైండ్స్ టు ఇన్నోవేట్' అనే థీమ్‌తో సాంకేతిక దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విశాఖలోని బాబా అటానమిక్ రీసెర్చ్ సెంటర్ లైట్ వాటర్ రియాక్టర్ హెడ్ పి.కె మిశ్రాను ఘనంగా సత్కరించారు. ఆయన భారత అణు కార్యకలాపాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో ఈఐఈ విశాఖపట్నం సెంటర్ గౌరవ కార్యదర్శి ఆ.నాగేశ్వరరావు, ఇష్రే విశాఖపట్నం చాప్టర్ కార్యదర్శి డి.రవీంద్రనాథ్, ఐఈఐ మాజీ చైర్మన్లు డాక్టర్ బి.వెంకటరమణ, బిందు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దైవ బలం.. దాతల సహకారం

భక్తిభావం పెంపొందిస్తున్న సద్గురు సేవాశ్రమం



రాళ్లగడ్డలో ప్రతిష్ఠించిన ఆంజనేయ విగ్రహం

తగరపువలస: ప్రజల్లో భక్తిభావం పెంపొందించేందుకు విశాఖలోని జీవీఎంసీ 3వ వార్డు రామయోగి అగ్రహారంలోని సద్గురు సేవాశ్రమం నిర్వాహకుడు కోన అప్పలరాజు అలియాస్ యోగారాజు తనవంతు కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా ఇప్పటివరకు ఉమ్మడి విశాఖ జిల్లా, ఒడిశాలో 610 ఆంజనేయస్వామి విగ్రహాలు ప్రతిష్టించారు. వీటిలో 570కు పైగా విగ్రహాలు మన్యంలోని అరకు, అనంతగిరి, చింతపల్లి, డుంబ్రిగుడ, గూడెం కొత్తవీధి, జి.మాడుగుల, హుకుంపేట, కొయ్యూరు, ముంచంగిపుట్టు, పాడేరు, పెదబయలు మండలాలతో పాటు ఒడిశాలోని కోరాపుట్, మల్కన్‌గిరి జిల్లాల్లో పూజలందుకుంటున్నాయి.

సహస్ర విగ్రహ స్థాపనే లక్ష్యంగా..

సహస్ర విగ్రహ స్థాపనే లక్ష్యంగా దాతల అండదండలతో ఈ మహాయజ్ఞం ముందుకు సాగుతోంది. ఈ నెల 13న పాడేరు మండలం మినుములూరులో 610వ విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేశారు. గిరిజనుల్లో భక్తిభావం సడలిపోకుండా ఆంజనేయ స్వామి విగ్రహాలు ప్రతిష్ఠిస్తున్నట్లు అప్పలరాజు తెలిపారు. ఆశ్రమం తరఫున ప్రతిష్ఠించిన విగ్రహాల్లో 5 నుంచి 12 అడుగుల సిమెంట్ విగ్రహాలతో పాటు ఇళ్లలో పూజించుకోవడానికి, జనాభా తక్కువ గల గ్రామాలకు 12 అంగుళాల కంటే తక్కువ సైజు రాతి విగ్రహాలు అందిస్తున్నారు.

ఏడాది పొడవునా పూజాసామగ్రి పంపిణీ

మన్యంలో ప్రతిష్ఠించిన విగ్రహాలు ఉన్న చోట 500కు పైగా ఆలయాలకు నెలకు రూ.2.25లక్షల వంతున ఏడాది పాటు రూ.27 లక్షల విలువైన పూజా సామగ్రి పంపిణీ చేశారు. విగ్రహ ప్రతిష్ఠ రోజు గిరిజనులకు దుస్తులు, స్టీల్ కంచాలు, దేవుళ్ల ఫొటోలను పంపిణీ చేస్తున్నారు. విగ్రహాల ఏర్పాటుకు ఇప్పటి వరకు ఆశ్రమం తరఫున రూ.2కోట్ల వరకు ఖర్చు చేశారు.

ఆలయాల నిర్మాణానికి చేయూత

ఏడాది కిందట అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో రూ.50 లక్షలు ఖర్చు చేసి 15 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహంతో పాటు ఆలయం నిర్మించారు. ఇదే కాకుండా హుకుంపేట మండలం మద్దివీధి శివాలయం పునరుద్ధరణ, ములుసోబలో వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. విజయసాయి యోగా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా యోగాలో ఉచిత శిక్షణ, నేత్ర వైద్యశిబిరాలు, తాగునీటి కొరత ఉన్నచోట బోర్ల తవ్వకాలు, వంటపాత్రలు పంపిణీ చేస్తున్నారు. గత ఏడాది చింతపల్లి ప్రాంతంలోమోటార్లు, పైపులైన్, టాంకర్ల ద్వారా అక్కడి ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించారు.

క్లుప్తంగా

నర్సుల సేవలు అమోఘం



నర్సులను సత్కరిస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్: రోగులకు సేవలు అందించడంలో నర్సుల పాత్ర అమోఘమని వక్తలు కొనియాడారు. ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక నర్సింగరావుపేట వెంకటేశ్వర నర్సింగ్‌హోమ్‌లో వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఆస్పత్రుల్లో నర్సుల విధులను కొనియాడారు. అంతకు ముందు వారిని సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు యల్లపు సాంబశివరావు, కార్యదర్శి భీశెట్టి రామకృష్ణ, సభ్యులు డి.డి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఆలయాలకు ట్రస్ట్ బోర్డ్ నియమించాలి'

అనకాపల్లిటౌన్: జిల్లాలో దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఆలయాలకు తక్షణమే ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయాలని హిందూ సంప్రదాయాలు, దేవాలయాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఆడారి కుమారిస్వామి ఓ ప్రకటనలో కోరారు. ట్రస్ట్ బోర్డు నియామకం ద్వారా భక్తులకు మరిన్ని మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అప్పారావు

కశింకోట: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కొంకి అప్పారావు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పందనకు బదులు ప్రవేశపెట్టిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనులను త్వరితగతిన నిర్వహించాలన్నారు. వైఎస్సార్ జగనన్న గృహ నిర్మాణ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి కావడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఏవో ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 480 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,310	5,090
రెండో రకం	3,960	4,210
మూడోరకం	3,600	3,950

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	: రాజా
రామబాణం	: సత్యనారాయణ-1
ఫర్హానా	: సత్యనారాయణస్క్రీన్-2
పీఎస్-2	: షిర్డీసాయి
విరుపాక్ష	: పర్తిసాయి
కల్యాణమస్తు	: వెంకటేశ్వర
ఉగ్రం	: శ్రీసత్య
ఏజెంట్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 130 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-40 యూనిట్లు, ఓ పాజిటివ్-80 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 385 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 339 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

నకిలీలకు చెక్

- విత్తనాలు, ఎరువుల నాణ్యత నిర్ధారణకు ఉచితంగా పరీక్షలు
- మార్కెట్ యార్డులో ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్
- ఇప్పటివరకు 248 శాంపిల్స్ పరీక్ష


అనకాపల్లి మార్కెట్ యార్డులో అగ్రి ల్యాబ్


ల్యాబ్‌లో పరీక్షల నివేదికలు పరిశీలిస్తున్న అధికారులు

అనకాపల్లి రూరల్: విత్తనం మంచిదైతే పంట బాగుంటుంది, దిగుబడికి దిగులుండదు. దిగుబడి, ధరలు అనుకూలిస్తే రైతన్నలకు తిరుగుండదు. అంతా సవ్యంగా జరగాలి అంటే సాగుకు మేలి రకం విత్తనాలు కావాలి. రైతు సంక్షేమమే లక్ష్యంగా అనేక సంస్కరణలు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారి ఉన్నతి కోసం నియోజకవర్గానికొక సమగ్ర వ్యవసాయ పరీక్షా కేంద్రం (ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్) మంజూరు చేశారు. దీనిలో భాగంగా అనకాపల్లి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వైఎస్సార్ అగ్రి ల్యాబ్ రైతులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఆరుగాలం శ్రమించే అన్నదాతలు నకిలీ విత్తనాలతో మోసపోకూడదనే సంకల్పంతో పైసా ఖర్చు లేకుండా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను ముందుగానే పరీక్షించేలా ఏర్పాటు చేశారు.

టెస్టింగ్ ప్రక్రియ ఇలా..

ఎరువులు, పురుగు మందులు, విత్తనాల నాణ్యత పరీక్షలను పారదర్శకంగా చేపట్టేందుకు విశాఖపట్నం, తిరుపతి, అమరావతి, తాడేపల్లిగూడెంలలో ప్రభుత్వం నాలుగు ప్రాంతీయ కోడింగ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ లక్ష్యాల మేరకు వ్యవసాయాధికారులు ఎరువుల దుకాణాల్లో విత్తనాలు, శాంపిళ్లను సేకరించి ప్రత్యేక యాప్ ద్వారా బ్యాచ్ నంబర్ కోడింగ్ చేసి రీజనల్ సెంటర్లకు పంపిస్తారు. ఆ శాపిళ్లను రీజనల్ సెంటర్ల బాధ్యులు ఆయా నియోజకవర్గాల్లోని అగ్రి ల్యాబ్‌లకు పంపి పరీక్షలు చేయిస్తారు. విత్తనాలైతే మొలక శాతం, తేమ శాతం, విత్తన నాణ్యత ప్రమాణాలు, పరిణామాలపై పరీక్షలు నిర్వహించి నివేదికలు ఇస్తారు. నకిలీవని తేలితే సంబంధిత షాపులపై చర్యలకు సిఫార్సు చేస్తారు. కేసు పెట్టి కోర్టు ముందు నిలబెడతారు. సంబంధిత కంపెనీపై ఏ చర్యలు తీసుకోవాలో న్యాయస్థానం నిర్ణయిస్తుంది. ఎరువులు నకిలీలుగా తేలితే రీ–అనాలసిస్ (తిరిగి పరిశీలన) చేసేందుకు షాపులో ఉన్న సరకు సీజ్ చేస్తారు. కేసు పెట్టి జాయింట్ కలెక్టర్ కోర్టులో హాజరు పరుస్తారు. చర్యలపై అక్కడ నిర్ణయం తీసుకుంటారు.

రైతుకు పరీక్షలు ఉచితం

కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై అనుమానం ఉన్న రైతులు దగ్గరలోని ల్యాబ్‌కు వెళ్లి ఉచితంగా పరీక్ష చేయించుకునే వెసులుబాటు కల్పించారు. ఇందుకు వ్యవసాయాధికారులు సహకరించాలి. ట్రేడర్లు, విత్తన, ఎరువులు, పురుగు మందుల కంపెనీల నిర్వాహకులు పరీక్ష చేయించుకోవాలంటే మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన నిర్దేశిత ధర చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం రైతులకు సమీపంలోనే ల్యాబ్‌లు అందుబాటులోకి రావడం, అధునాతన సాంకేతికతతో పరీక్షలు నిర్వహిస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అగ్రి ల్యాబ్‌లకు ఇన్‌చార్జిలుగా వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకుడు (ఏడీఏ) వ్యవహరిస్తారు. ఇద్దరు ఏవోలు, ఒక ల్యాబ్ టెక్నీషియన్ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతి ల్యాబ్‌లో నమూనా పరీక్ష కోసం ప్రత్యేకంగా ఆటోమేటెడ్ క్వాలిటీ కంట్రోల్ యాప్ (ఇన్‌సైట్)ను అభివృద్ధి చేశారు. ఫలితాలను తారుమారు చేసేందుకు వీల్లేని రీతిలో ల్యాబ్‌లో ఆటోమేషన్ ఏర్పాటు చేశారు. టెస్టింగ్ చేసిన ప్రతి ఒక్కటీ రికార్డు కావడంతో పాటు వాటంతటవే సిస్టమ్‌లో నమోదవుతాయి.

అనకాపల్లి అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో ఇప్పటి వరకు 248 శాంపిల్స్ పరీక్షించారు. ఆ నివేదిక వివరాలు..

శాంపిళ్లు	పరీక్షించినవి	నాణ్యత లేనివి
ఎరువులు	122	2
విత్తనాలు	126	0

రైతులు వినియోగించుకోవాలి



నాణ్యత ప్రమాణాలతో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందించడమే వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు ప్రధాన ఉద్దేశం. రైతులకు ఈ ల్యాబ్‌లు ఎంతో ఉపయుక్తం. నకిలీల నుంచి పంటను కాపాడుకునే అవకాశం లభిస్తుంది.

– ఎం.రామారావు, ఏడీఏ, అనకాపల్లి

ప్రాజెక్ట్ వర్క్‌లో డైట్ కళాశాలకు ప్రథమ స్థానం


కళాశాల విద్యార్థులకు జ్ఞాపికలు అందిస్తున్న ప్రిన్సిపాల్ నర్సింహం

అనకాపల్లిటౌన్: నేషనల్ టెక్నాలజీ డే ను పురస్కరించుకొని రూపొందించిన ప్రాజెక్ట్ వర్క్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో స్థానిక డైట్ కళాశాల ప్రథమస్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ చల్లా నర్సింహం తెలిపారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి నేవీ స్కూల్స్, ప్రైవేట్ స్కూల్స్, ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 96 ఇన్నోవేటివ్ ప్రాజెక్టులు రాగా 43 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని తెలిపారు. వీటిలో డైట్ కళాశాల నాలుగు ప్రాజెక్టులు ప్రదర్శించగా 'లైట్ ట్రాన్స్‌మిటింగ్ సిమెంట్ కాంక్రీట్ బ్రిక్ ' ఇంజినీరింగ్ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. ప్రాజెక్ట్ తయారుచేసిన విద్యార్థులకు ఎన్ఎస్‌టీఎల్‌లో గురువారం నిర్వహించిన వేడుకల్లో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ శుక్రవారం అభినందించారు. ప్రాజెక్ట్‌కు కావలసిన సహాయ సహకారాలు అందిస్తామని ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు తెలిపారని నర్సింహం తెలియజేశారు.

డీఈవోకు వినతి


డీఈవో వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో సభ్యులు

అనకాపల్లిటౌన్: వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులతో అదనపు పనులు చేయించరాదని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ గొంది చినబ్బాయి విజ్ఞప్తి చేశారు. సభ్యులతో కలిసి, డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయకుండా వేసవిలో ఉపాధ్యాయులతో పనులు చేయించుకోవాలని చూస్తోందని, దీనిని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఈఎల్స్ మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా కో–చైర్మన్ సీహెచ్.వెంకటేశ్వర్లు, కార్యదర్శి వై.సుధాకరరావు, సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం


సిబ్బందికి సూచనలు ఇస్తున్న సర్పంచ్ పెంటయ్యనాయుడు

అనకాపల్లి రూరల్: గ్రామాల్లో గర్భిణుల ఆరోగ్య పరిస్థితిపై సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు సూచించారు. తుమ్మపాల విలేజ్ హెల్త్ క్లినిక్‌లో శుక్రవారం నిర్వహించిన శానిటేషన్, న్యూట్రిషన్ కమిటీ సమావేశంలో ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి గర్భిణిని 12 వారాల్లోనే తప్పనిసరిగా గుర్తించి, సేవలను పక్కాగా అందించాలని చెప్పారు. గర్భిణుల్లో పోషకాహార లోపం తలెత్తకుండా పర్యవేక్షించాలని, అవసరమైన వారికి పోషకాహార కిట్లను అందజేయాలని సూచించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో తుమ్మపాల గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు రవ్వా శ్రీను, తర్ర సత్యారావు, 1,2,3 సచివాలయాల ఏఎన్ఎంలు రాజేశ్వరి, జయలక్ష్మి, భారతి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్ పనుల పరిశీలన

అనకాపల్లి రూరల్: మేజర్ పంచాయతీ తుమ్మపాల అంబేడ్కర్ నగర్‌లో సుమారు ఆరు లక్షల రూపాయలతో పునర్నిర్మిస్తున్న సులభ్ కాంప్లెక్స్ పనులను సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు శుక్రవారం పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపం లేకుండా చూడాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు తర్ర సత్యారావు, రవ్వ శ్రీను, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటిపన్ను విషయమై విచారణ


ఏఎస్ పేటలో విచారణ జరుపుతున్న ఎంపీడీవో అప్పారావు

కశింకోట: మండలంలోని ఏఎస్ పేట గ్రామంలో పంచాయతీ కార్యదర్శిపై ఇంటి పన్ను విషయమై ఒకే కుటుంబం నుంచి వచ్చిన మరో అర్జీపై ఎంపీడీవో కొంకి అప్పారావు శుక్రవారం విచారణ జరిపారు. భర్త మృతి చెందిన అనంతరం తన పేరున కాకుండా ఒక కుమారుడి పేరున ఇంటి పన్ను వేసిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ముప్పిడి దేవుడమ్మ కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి ఆదేశాల మేరకు అక్కడి సచివాలయంలో విచారించారు. పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి భర్త మృతి చెందిన తర్వాత భార్య పేరున ఇంటి యజమానిని మార్పు చేసి పన్ను వేయాల్సి ఉందని, అలా కాకుండా తన కుమారుల్లో ఒకరైన ముప్పిడి వెంకటేష్ పేరున పన్ను వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదుదారుతో పాటు పంచాయతీ కార్యదర్శి ఎన్.సత్యారావులకు నోటీసు ఇచ్చి విచారించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. 2013లో ఫిర్యాదుదారు దేవుడమ్మ సూచన మేరకు వెంకటేష్ పేరున ఇంటి పన్ను వేసినట్లు పంచాయతీ కార్యదర్శి సత్యారావు వివరణ ఇచ్చారు. అయితే తాజాగా చేసిన ఫిర్యాదు నేపథ్యంలో విచారించి దేవుడమ్మ ఇద్దరు కుమారులు, కుమార్తె పేరిట మార్పు చేసి ఇంటి పన్ను వేసి ఇవ్వనున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఇదిలా ఉండగా ఏఎస్ పేట పంచాయతీలో ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ముప్పిడి వెంకటేష్ స్పందనలో మొదట ఫిర్యాదు చేయడంతో, పంచాయతీ కార్యదర్శి సత్యారావుపై డీపీవో శిరీషారాణి గురువారం విచారించిన సంగతి తెలిసిందే.

కల్యాణం.. కమనీయం


అప్పన్న కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, అక్షింతలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

15 రోజులకోసారి మండలస్థాయిలో స్పందన


అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

సింహాచలం: మండల స్థాయిలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించడానికి స్పందన కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. పెందుర్తి మండలంలో నెలలో రెండు శుక్రవారం రోజుల్లో స్పందన నిర్వహిస్తామని చెప్పారు. పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం స్పందన కార్యక్రమాన్ని ఆర్డీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ ఆదేశాల మేరకు నెలలో రెండుసార్లు పదిహేను రోజులకోసారి విశాఖలోని ఆరు మండలాల్లో స్పందన నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలస్థాయిలో అధికారులు తీసుకున్న నిర్ణయాలకు అర్జీదారులు తృప్తి చెందకపోతే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. మండలస్థాయిలో స్పందన పెట్టడం ద్వారా క్లిష్టమైన సమస్యలు ఉన్నవాళ్లు, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రాలేనివాళ్లు, వృద్ధాప్యంలో ఉన్నవాళ్లకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో స్పందన నిర్వహించడం వల్ల అధికారులు, వీఆర్‌వోలు సిబ్బంది అందుబాటులో ఉండి అప్పటికప్పుడు సమస్య పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు.24 గంటల్లో సమస్య పరిష్కారం అవ్వాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. క్లిష్టమైన సమస్యలు సమయానుకూలంగా పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ప్రజలంతా స్పందన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం నిర్వహణ ద్వారా తప్పుడు నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండదన్నారు. పారదర్శకంగా అర్జీదారుడు సంతృప్తి పొందేలా సమస్య పరిష్కరించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో పెందుర్తి తహసీల్దారు ఆనంద్‌కుమార్, ఎంపీడీవో వెంకటరావు పాల్గొన్నారు.

ఈకేవైసీకి తుది గడువు ఈ నెల 15


వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్న చైర్మన్ రామారావు

పరవాడ: పీఎం కిసాన్, ఈకేవైసీ చేసుకోని రైతులు ఈ నెల 15వ తేదీలోగా నమోదు చేయించాలని మండల వ్యవసాయ సలహా సంఘ చైర్మన్ కోన రామారావు అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈకేవైసీ చేయించని రైతులకు నగదు పడదని రామారావు చెప్పారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి మాట్లాడుతూ వైఎస్సార్ రైతు భరోసా లబ్ధిదారుల జాబితా ఆర్‌బీకేలో అందుబాటులో ఉంచుతామన్నారు. అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు కావాల్సిన రైతులు ముందుగా తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చంద్రావతి కోరారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు చైర్మన్ రామారావు వ్యవసాయ పనిముట్లు అందజేశారు. కార్యక్రమంలో సలహా మండలి సభ్యులు బండారు రాజశేఖర్, పోలిరెడ్డి అప్పారావు, కన్నూరి అయ్యబాబు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయొద్దు'


తేగాడలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నాయకుడు శ్రీనివాసరావు

కశింకోట : కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తేగాడలో ఉపాధి కూలీలతో సమావేశమై శుక్రవారం వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీన్ని మానుకోవాలని హితవుపలికారు. సొంత గ్రామాల్లోనే పనులు కల్పించి, కూలీలు వలస పోకుండా ఉపాధి పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. వ్యవసాయ రంగానికి ఉపకరించేలా ఉపాధి పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీని రోజుకి రూ.600కు పెంచి, 200 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. వేసవి దృష్ట్యా ఉపాధి కూలీలకు మజ్జిగ, మంచినీరు సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు ఎం.శ్రీదేవి, కె.శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వర్తక సంఘం అధ్యక్షునిగా నూక అప్పారావు


కల్యాణవేదిక నూతన కమిటీ

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి వర్తక సంఘం కర్రి రమేష్ కల్యాణవేదిక అధ్యక్షునిగా దొడ్డి నూకఅప్పారావు ఎన్నికయ్యారు. గవరపాలెం సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా బుద్ద శ్రీనివాసరావు, కోశాధికారిగా కర్నాటకపు సుబ్రహ్మణ్యం, ఎక్స్ అఫీషియో సభ్యులుగా కొణతాల లక్ష్మీనారాయణరావు(పెద్దబాబు), తమ్మన రఘుబాబు, సభ్యులుగా కోరిబిల్లి సత్యనారాయణ, సూరిశెట్టి వరాహనూకరాజు, ఆళ్ల మోహన్‌శివ శంకర్, ఎం.ఎస్.వి.చలమయ్య(సురేష్), సుంకర వెంకట రామకృష్ణారావులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి మాట్లాడుతూ కమిటీ పదవీకాలం మే 2025 వరకూ ఉంటుందన్నారు. కల్యాణమండపం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.

క్రీడలతో ఆరోగ్యం


క్రీడాకారులకు వాలీబాల్ కిట్‌ను అందజేస్తున్న సూర్యారావు

అనకాపల్లిటౌన్: ఆరోగ్యకర జీవనానికి క్రీడలు దోహదం చేస్తాయని జిల్లా క్రీడాప్రాధికారిక సంస్థ చీఫ్ కోచ్ నగిరెడ్డి సూర్యారావు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం వేసవి క్రీడా శిక్షణ కార్యక్రమంలో భాగంగా క్రీడాకారులకు ఉచితంగా క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏడాది ప్రభుత్వం వేసవిలో నెలరోజులు వివిధ క్రీడలపై శిక్షణ ఇస్తోందన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 50 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5 నుంచి 16 సంవత్సరాలలోపు పిల్లలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు జిల్లాలోని వివిధ క్రీడా మైదానాల్లో ఆయా ప్రాంతాల వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోచ్‌లు జొన్నాడ శ్రీనివాసరావు, వేణుగోపాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారానికి చర్యలు


అర్జీదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్: ఇటీవల స్పందనలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి ఇచ్చిన అర్జీల్లో డివిజన్ పరిధిలోని అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీవో ఎ.జి.చిన్నికృష్ణ, డీఎస్పీ సుబ్బరాజు తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం 11 మంది అర్జీదారులతో సమావేశమై పరిష్కార మార్గాలను అన్వేషించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం డివిజన్ పరిధిలో ఉన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. 11 మంది సమస్యలను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ బాబూరావు, అర్జీదారులు పాల్గొన్నారు.

రైల్వేపాస్ ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేయాలి


ఎంపీ సత్యవతికి వినతిపత్రం అందజేస్తున్న వీరుయాదవ్

అనకాపల్లిటౌన్: దివ్యాంగులకు రైల్వేపాస్ ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేయాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరు యాదవ్ అన్నారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతిని శుక్రవారం కలిసి, వినతిపత్రం అందజేశారు. గతంలో రైల్వే పాస్‌లు మాన్యువల్‌గా ఇచ్చేవారని, ఆన్‌లైన్ విధానాలతో దివ్యాంగుల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దివ్యాంగులు ఇంటర్‌నెట్‌ల చుట్టూ తిరగలేక పోతున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరారు. సంఘం సభ్యులు యలమర్తి రవి, కరణం శివ, ముక్కా గణేష్, కాండ్రేగుల నూకఅప్పారావు, షేక్ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి


హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్: జగనన్న గృహాలను త్వరితగతిన పూర్తి చేసి, లబ్ధిదారులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలతో అందిస్తామని ఆర్డీవో ఎ.జి.చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని మామిడిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న జగనన్న గృహాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని లబ్ధిదారులను కోరారు. అంతకు ముందు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు.కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధరరావు, ఎంపీడీవో ధర్మారావు, హౌసింగ్ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు సత్వరమే ప్రారంభించాలి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎస్‌వో రోజారాణి

కశింకోట: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇంకా ప్రారంభించని ఇళ్లను లబ్ధిదారులు సత్వరమే ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి రోజారాణి కోరారు. మండలంలోని ఏఎస్ పేట గ్రామంలో వైఎస్సార్ జగనన్న కాలనీలో హౌసింగ్ విజిట్‌లో భాగంగా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సుమారు పది ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాలేదని గుర్తించారు. వీటి పనులు త్వరితగతిన చేపట్టకపోతే పట్టాలను రద్దు చేస్తారని హెచ్చరించారు. ఎంపీడీవో కొంకి అప్పారావు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.